


ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 8 సంచిక : 22 పుష్పం : 54-55 05-8-2003

**RAMANA BHASKARA**
TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE
PAGES : 16
VOL : 8 ISSUE : 22
EDITOR
P.S. RAMA RAJU
EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)
SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**
ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.
PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎08814 - 224589, 224689
PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎08814 - 222438, 221260
94401-31188


## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 06-07-2003, ఉండి

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనకు మోక్షం కావాలంటే, శాశ్వతమైనశాంతి కలగాలంటే, తత్వాన్ని తెలుసుకోవాలంటే బ్రహ్మావిద్యను ఆశ్రయించాలి. బ్రహ్మావిద్యను ఆశ్రయిస్తేనేగాని బ్రాహ్మీస్థితి కలుగదు. శాంతిపూరితమైనది, జ్ఞానపూరితమైనది, కలకాలము ఉండేది, పూర్ణంగా ఉండేది బ్రహ్మం ఒక్కటే. దానిని తెలుసుకోవాలంటే బ్రహ్మాజిజ్ఞాస లేకుండా బ్రహ్మం తెలియబడదు. ఆ జిజ్ఞాస కలగటానికే ఈ సత్సంగ సమావేశాలు అంతేగాని ఎవరినో ఊరేగించటానికి కాదు. మనకు బ్రహ్మామును తెలుసుకోవాలనే కాంక్ష ముఖ్యం, అది తప్పించి మన మనస్సులో ఏమీ ఉండకూడదు. మనదేహాన్ని, ఇంద్రియాలను, మనస్సును బ్రహ్మామును తెలుసుకోవటానికి మేగ్జిమమ్ ఉపయోగించుకోవాలి. బ్రహ్మం ఒక్కటే సత్యం. మనం బ్రహ్మంను చింతించటం మానివేసి బ్రహ్మం కానిదానిని చింతిస్తున్నాము, బ్రహ్మంను పొందాలనుకొంటున్నాము, ఇది పొసగని విషయం. ఆత్మకానిదానిని చింతిస్తూ ఆత్మను పొందటం అనేది సాధ్యంకాదు. నువ్వు ఏది చింతిస్తూ ఉంటే అదేనువ్వు అవుతావు. మనం ఇక్కడ నుండి భీమవరం వెళదామని ఆకివీడు వెళ్ళేకారులో కూర్చుంటే ఎలా ఉంటుందో మన పరిస్థితికూడా అలాగే ఉంది. మనస్సులో భీమవరం వెళ్ళాలి అనుకోవటం, కూర్చోవటం మటుకు ఆకివీడు వెళ్ళే కారులో కూర్చొంటున్నాము. బ్రాహ్మీస్థితిని పొందాలనుకొనేవాడికి ముందు ఆ బ్రహ్మంయందు గౌరవం ఉండాలి, దానివిలువ తెలియాలి. మోక్షం అనే పెట్టె మన దగ్గరే ఉంది కాని తాళంచెవి ఆయన దగ్గర పెట్టుకొన్నాడు భగవంతుడు. తాళం మనకు ఇస్తే ఆపెట్టెను ఓపెన్ చేసుకోవచ్చును కాని తాళం అంత తేలికగా మనకు ఇవ్వడు. పూజలు, జపాలు చేయటం మంచిదే అంతమాత్రంచేతనే తాళం ఇవ్వడు. మీరు స్త్రీలు అయినా, పురుషులు అయినా మీరు ఏమతస్థులయినా, ఏకులస్థులయినా తాళం మనకు ఇచ్చేటప్పుడు భగవంతుడు ఒక్కటే చూస్తాడు. వీడిలో అజ్ఞానం ఉందా, లేదా అని చూస్తాడు. అజ్ఞానము లేదని మనం నిర్ణయించుకొంటే చాలదు, మనలో అజ్ఞానం లేదు అని ఆయన అనుకొంటే అప్పడు ఆ తాళం మనకు ఇస్తాడు, అప్పడు మనకు మోక్షం. మీలో అజ్ఞానం కొంచెం మిగిలిఉన్నా, ఏమాత్రం శేషంఉన్నాకూడా తాళం ఇవ్వడు. ఎందుచేతనంటే శేషం ఉంటే మరల అది విజృంభించే అవకాశం ఉంది. మనకు ఉన్న అప్ప అంతా తీరిపోయింది అనుకోండి, ఒక వెయ్యి రూపాయిలు మాత్రమే అప్ప ఉంది అనుకోండి. ఒక వెయ్యి రూపాయలేకదా అని దానిని అశ్రద్ధచేస్తే వడ్డీతో సహా మరల అది లక్షరూపాయలు అయిపోతుంది. అందుచేత అజ్ఞానం కొంచెంఉన్నా, అహంభావన కొంచెంఉన్నా మరల అది పెరిగే అవకాశం ఉంది. అందుచేత బహుజాగ్రత్తగా ఉండాలి. మన మనస్సుకి వ్యర్థమైన ఆలోచనలు వస్తూ ఉంటాయి, వాటికి ఒక క్రమం ఉండదు. ఈ మధ్య హైదరాబాదులో చదువుతున్న ఒక అబ్బాయి వచ్చాడు మీ కాలేజీలో ఫస్టు ఎవరు అని అడిగాను. ఒక అమ్మాయికి వచ్చింది, పేరు నిష్కళ అని చెప్పాడు. కళంకము లేకుండా ఉండాలి అని ఆపేరుపెట్టారు. ఆ అమ్మాయికి స్టేట్ ఫస్టు వస్తే ఎంతో నిర్మలంగా ఉంది, మనం అయితే గొప్పలు చెప్పకుంటాము. నీకు స్టేట్ ఫస్ట్ వచ్చిందని మనం అమ్మాయితో చెపితే గాని గుర్తురాదట. మనకు ఏద్దైనా కలిసివస్తే పట్టుకోలేము, కలిసిరాకపోతే ఏడుస్తూ కూర్చుంటాము. అదీ తట్టుకోలేము, ఇదీ తట్టుకోలేము అంటే మన ఆలోచనలో లోతులేదు, విశాలం లేదు, స్పష్టత లేదు, మనకు ఆలోచన ప్రధానం కాదు, సబ్జక్టూ ప్రధానంకాదు ఇలా ఉన్నాము. కాని మనం తరించాలంటే ఒకటి సబ్జక్టు, రెండు ఆలోచన వీటిని ప్రధానంగా తీసుకోవాలి, మిగతా విషయాల జోలికి వెళితే మనం మార్గం తప్పిపోతాము. మీ కుటుంబాలలో ఏమైనా ఇబ్బందులు వస్తూ ఉంటాయి, ఎవరైనా మిమ్మల్ని విమర్శిస్తూ ఉంటారు, మీకు ఆర్థిక

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**


06-7-2003 ఉండి ........ 1
21-7-2003 విశాఖపట్నం ........ 10

ఇబ్బందులు రావచ్చును, మీ కుటుంబాలలో ఎవరైనా మరణిస్తూ ఉంటారు అప్పుడు మీకు దుఃఖం వస్తూ ఉంటుంది. ఒకటి మాత్రం మీరు జాగ్రత్తగా చూసుకోండి. మీకు ఏదైనా కష్టం వచ్చినా, నష్టం వచ్చినా, పొంగు వచ్చినా, దుఃఖం వచ్చినా మీ ఆలోచనలో దారి తప్పకూడదు. రైలుబండి ఎప్పడూ పట్టాలు విడిచిపెట్టకుండా ఎలా వెళుతూ ఉంటుందో అలాగే మీ ఆలోచన ఎప్పడూ తైలధారవలె బ్రహ్మం వైపునకే ఉండాలిగాని దారి తప్పకూడదు. ఇంట్లో ఏవో గొడవలు వచ్చినాయి, ఏవో నష్టాలు వచ్చినాయి అని అటు వెళ్ళిపోతే మన ఆలోచన దారితప్పతుంది. నదులకు భర్త సముద్రుడు. మన భర్తలోపల ఉన్న బ్రహ్మం. నదీ ప్రవాహము ఎప్పడూ సముద్రంవైపునకు ఎలాగ ఉంటుందో అలాగ మన ఆలోచనా ప్రవాహము ఎప్పడూ హృదయంలో ఉన్న బ్రహ్మంవైపునకు ఉండాలి. ఒక్క ఆత్మజ్ఞానము తప్పించి, ఆత్మవిద్య తప్పించి మిగిలిన విద్యలు అన్నీ కనికట్టు విద్యలు అని భగవాన్ చెప్పారు. ఆవిద్యలు అన్నీ పొట్టకేపనికి వస్తాయి, అవి అన్నీ మనస్సు కల్పించిన విద్యలు, సత్యాన్ని తెలుసుకోవటానికి అవి పనికిరావు అని నిష్కర్షగా చెప్పారు. మనం 24 గంటలు దేహం గురించే ఆలోచిస్తూ ఉంటాము, ఆ పాడుబుద్ధిపోవాలి. మీ దేహాన్ని పాడుచేసుకోవద్దు, జాగ్రత్తగా చూసుకోండి, దానికి టైముకు అన్నం పెట్టండి, ఏదైనా రోగంవస్తే మందులు వేయండి అంతేగాని అస్తమాను దేహం గొడవ ఉండకూడదు. ఈ దేహం ఎప్పడో ఒకప్పడు వల్లకాటిలో కాలిపోయేదే. మనకు గాఢనిద్రలో తప్పించి మిగతాటైములో అంతా దేహం గొడవే. ఈ దేహబుద్ధిలోనుండి మనస్సును ఆత్మబుద్ధివైపుకు త్రిప్పాలి. అందుకే సాధన. మనంచేసే సాధనలో మన మనస్సు, దేహము, ఇంద్రియాలు మనకు సహకరిస్తేనేగాని మనం హృదయంలోనికి చేరుకోలేము. మీకు ఇంట్లో తినటానికి తిండి ఉంది, ఖర్చు పెట్టుకోవటానికి డబ్బు ఉంది, అన్నీ బాగానే ఉన్నాయి. మరి మీకు దుఃఖం ఎందుకు వస్తోంది. నాకు ఏరకమైన దుఃఖస్పర్శలేదని ఇక్కడ ఉన్నవారిలో ఎవరైనా చెప్పగలరా? పూజలు, జపాలు అన్నీ బాగానే చేసుకొంటున్నారు మరి ఎందుకు దుఃఖం వస్తోంది? అంటే మీలోపల అజ్ఞానం ఉంది. మనం భగవంతుడిని మోసం చేయలేము. ఆయన నీ ఐశ్వర్యాన్ని చూడడు, నీవు ఏ కులమో ఆయనకు అక్కరలేదు, నీవు ఎక్కడ ఉన్నావో ఆయనకు అక్కరలేదు, నీలో అజ్ఞానం ఉందా, లేదా అని చూస్తాడు, ఉంటే పునర్జన్మలోనికి పంపిస్తాడు, అజ్ఞానం లేదు అనుకో నీకు మోక్షం ఇస్తాడు. దేహానికి ప్రారబ్దం ఉంటుంది. ఒకోసారి సంతోషకరమైన సంఘటనలు,





ఒకోసారి దుఃఖకరమైన సంఘటనలు వస్తూ ఉంటాయి, వాటిని చూసి మన ఆలోచనాక్రమం విడిచిపెట్టకూడదు అంటున్నారు భగవాన్. మనందరము చేస్తున్న పొరపాటు ఏమిటో ఇక్కడ భగవాన్ చెపుతున్నారు. మనం లోకంలో సుఖం ఉందని, సినిమాలో సుఖం ఉందని, టీవీలో సుఖం ఉందని ఇలా సుఖంకోసం బయట వెతుకుచున్నాము. ఎక్కడ సుఖంలేదో అక్కడ వెతుకుచూ కోట్లాది జన్మలు పాడుచేసుకొంటున్నాము. ఎక్కడ సుఖం ఉందో నీకు చూపించి, నీ ఆలోచనావిధానాన్ని మలుపు త్రిప్పేవాడే గురువు. మనస్సు ఉన్నంత సేపు ఏవో సందేహాలు వస్తూ ఉంటాయి. ఏరోజుకు ఆరోజు అస్తమాను నీవు సందేహిస్తూ ఉంటే ఇంక నీకు జ్ఞానం ఏమిటి? అందువలన గురువును ఆశ్రయించి నీ సందేహాలను నివృత్తి చేసుకో అని భగవంతుడు చెప్పాడు. చెడు వినకు, చెడు చూడకు, చెడు మాట్లాడకు ఇవి గాంధీగారి సూత్రాలు. చెడు ఆహారం తీసుకోవద్దు అని ఇంకో సూత్రం కలిపాడు ఈమధ్య ఒక మహాత్ముడు. అంటే నీవు తీసుకొనే ఆహారం శుచిగా ఉండాలి, సాత్వికంగా ఉండాలి. మనం గుడికి వెళతాము. అక్కడ దేవుడిని ఏదో భౌతిక విషయాలను గురించి అడుగుతాము కాని జ్ఞానాన్ని ప్రసాదించమని, నన్ను నేను తెలుసుకొనే శక్తిని ప్రసాదించమని దేవుని ప్రార్థించము. ఇవాళ పచ్చగా ఉండి రేపు ఎండిపోయే విషయాల గురించి ప్రార్థిస్తాము. భక్తిపేరుమీద మనం దేహం చుట్టూ తిరుగుతున్నాము ఇక్కడ చెప్పేది ఏమిటి అంటే నీ మొఖం బ్రహ్మవైపుకు తిరగాలి. దుఃఖకారణం బయటలేదు నీ లోపలే ఉంది, అహంకారరూపంలో ఉంది, కర్తృత్వరూపంలో ఉంది. ఏమిటి పొంగిపోతున్నావు, దేనిని చూసి పొంగిపోతున్నావు, నీద్వారా ఏది జరిగినా ఈశ్వరుడికి తెలియకుండా అది జరగటంలేదు, నోరుమూసుకొని పడిఉండు. నీవు దేనికి కర్తవు కాదు, కర్త ఈశ్వరుడే. కాని నేనే కర్తను అని నీవు అనుకుంటున్నావు అక్కడ నుండి మనిషి కూడా నీడ వచ్చినట్లు నీకూడా దుఃఖం వెంటాడుతోంది. కర్త ఈశ్వరుడు, ఆయన ఆజ్ఞననుసరించి ప్రతీదీ జరుగుతుంది. మీ ఇంట్లో ఎవరైనా చనిపోతే ఆ చనిపోయిన వారి పని కొంచెం మనం చేస్తూ ఉంటే వారిమీద మనకు గౌరవం ఉన్నట్లు అంతేగాని ఏడిస్తే గౌరవం ఉన్నట్లుకాదు.

బ్రహ్మం నీ హృదయంలో ఉంది. దానికి మరణంలేదు. ఏ పదార్థానికి అయితే చావులేదో అది నీవై ఉన్నావు. ఒకవేళ నీవు చనిపోవటానికి ప్రయత్నంచేసినా నువ్వు ఎలా చనిపోగలవు అంటున్నారు భగవాన్. చనిపోయే వస్తువు బ్రతకదు, చావులేని వస్తువుకు

చావు రమ్మన్నారాదు. బ్రహ్మంకు చావులేదు, అది నీవై ఉన్నావు కాని దాని తాలుక అనుభవం నీకు లేదు అంతే. దాని తాలుక అనుభవం నీకు కలగటానికి సహాయసహకారములు అందించే వాడే గురువు. మరల గురువు అంటే ఎవడో అనుకుంటున్నావేమో బ్రహ్మానుభవం పొందాలి అనే కాంక్ష నీకు కలిగినప్పుడు, అది నిజమైనప్పుడు నీ హృదయంలో ఉన్న బ్రహ్మమే ఒక రూపం ధరించి వస్తుంది, వాడే గురువు. బ్రహ్మంకు రూపంలేదు కాని నీవు రూపాలమీద ఆధారపడి ఉన్నావు కాబట్టి బ్రహ్మమే రూపం ధరించి వస్తుంది. నీ మనస్సుకు లోచూపు కలగచేయటంకోసం ఆకారం లేనిది ఆకారం ధరించి వస్తుంది. నీకోసం ఆకారం ధరించి వస్తాడు కాని ఆకారంతో వారికి పనిలేదు. ధర్మరాజుచేత చిన్న అబద్దంచెప్పించాడు కృష్ణుడు. ఏమిటి కృష్ణుడు అబద్దం చెప్పించాడు అనుకోకూడదు, ధర్మాన్ని స్థాపించటం కోసం అలాచేసాడు అంతే. ఆయన గమ్యం ఏమిటి? ధర్మాన్ని స్థాపించటం. దానికోసం అబద్దం చెప్పించాడు అది మర్చిపోకూడదు. ధర్మాన్ని ఆచరించకుండా మనస్సు అణగదు. భగవదనుభవం పొందటానికి విచారణామార్గం, శరణాగతి మార్గం రెండూ భగవాన్ చెప్పారు. కొంతమందికి మనోబలం ఎక్కువ ఉంటుంది, ఆత్మవిశ్వాసం ఉంటుంది, వారికి విచారణామార్గం మంచిది. మీకు మనోబలం లేనప్పుడు, మీరు ఎవరో మీరు తెలుసుకొనే శక్తి మీకు లేనప్పుడు ఈశ్వరుడిని ఆరాధించండి, ఆయన పాదాలను ఆశ్రయించి, శరణాగతి చెంది, భగవదనుభవం పొందండి. మనం శరణాగతి మార్గంలోనికి వచ్చేయటమే మంచిది. ఆయనకు శరణాగతి మార్గం స్వీట్‌గా ఉంటుంది, ఇందులో సపోర్టు కనిపిస్తూ ఉంటుంది. కృష్ణుడో, శివుడో, రాముడో ఏదో సపోర్టు కనబడుతూ ఉంటుంది. విచారణామార్గంలో అంతానీవే, అన్ని పాత్రలు నీవే పోషించుకోవాలి. నీకు ఏ మార్గం నచ్చితే ఆ మార్గంలో ప్రయాణం చెయ్యి. భగవాన్ ఏమన్నారు అంటే అన్నీ బాగుంటే దేవుని ప్రార్థించే అలవాటు మాకులేదు, అన్నీ ఊడిపోయిన తరువాత ప్రార్థిస్తాము, పోనీ ఇప్పుడు అయినా ప్రార్థిస్తున్నారు కదా అని మమ్మల్ని ఆశీర్వదించి, మా పొరపాట్లు ఏమైనా ఉంటే క్షమించి, మాకు మోక్షాన్ని ఇవ్వు అని అరుణాచలేశ్వరుడితో అన్నారు. నాన్నగారి ఉపన్యాసాలకు ఎందుకు వెళుతున్నారు అని ఎవరైనా మిమ్మల్ని అడుగుతారు అనుకోండి. వారికి ఎక్కడో ఒక మొట్టికాయ తగిలాక మీకంటే ఎక్కువసార్లు వస్తారు. కొంతమందికి మొట్టికాయ తగిలితేనేగాని బుద్ధిరాదు. మనం మూడు విషయాలలో జాగ్రత్తగా ఉండాలి. మనకు వచ్చే తలంపుల విషయంలో, నోటితో మాట్లాడే మాటల విషయంలో, చేతితోచేసేపనుల విషయంలో మనం బహుజాగ్రత్తగా ఉండాలి. భగవాన్ ఏమి చెప్పారు అంటే మంచితలంపులు తెచ్చుకొని బాగుపడటం, చెడుతలంపులు తెచ్చుకొని పాడయిపోవటం రెండూకూడా నీచేతిలోనే ఉన్నాయి, ఏది చేయాలో నీవే నిర్ణయించుకో అని చెప్పారు. నీ మనస్సుతో విరోధం పెట్టుకోవద్దు. నీ మనస్సుతో స్నేహంగా ఉంటూ అభివృద్ధి లోనికి రావటానికి ప్రయత్నం చేసుకో. అభివృద్ధిలోనికి రావటానికి నీవు ఎప్పుడూ ప్రయత్నం చేస్తూ ఉండనక్కరలేదు. కొంత ప్రయత్నం చేసాక ఈశ్వరుని దయనీకు అందుతుంది, అప్పుడు ప్రయత్నంలేనిస్థితిని పొందుతావు. నేను జపం చేసుకొంటున్నాను. మనస్సులో చేసుకొనే అలవాటు లేదు, గట్టిగా చేస్తూ ఉంటాను అని భగవాన్‌తో అంటే నువ్వు ఎలా చేసుకొన్నా నీ అలవాటు నీది, నువ్వు మనస్సులో చేసుకొన్నా, పైకి చేసుకొన్నా మనస్సుకు నిర్మలత్వం వస్తుంది, చేసుకో మానవద్దు కాని పైకి నోటితో చేసే జపం కన్న, మనస్సుతోటి చేసే జపం లాభదాయకం, దాని వలన ఏకాగ్రత వస్తుంది. మీకు ఏకాగ్రత కుదిరితే మోక్షం వచ్చేస్తుంది. జీవితంలో ప్రేమ ఉండాలి, ప్రేమలేని జీవితాలు వ్యర్థం. కొంతమందికి ప్రేమ అనేది ఎలా ఉంటుందో తెలియదు. ప్రేమలేకపోతే ఈశ్వరుడి యందు భక్తి కలుగదు. భక్తిలేకపోతే ఆయనను తెలుసుకోవాలనే కాంక్ష కూడా ఉదయించదు. నుయ్యి తవ్వాలి అనుకొన్నావు అనుకో అక్కడో గెడ్డపార, ఇక్కడో గెడ్డపార వేస్తే నీకు రాదు, ఒకేచోట వంద గెడ్డపారలు వేస్తే నీళ్ళు పడతాయి. నీవు రకరకాలుగా ఆలోచించవద్దు. నీకు ఇష్టమైన మార్గాన్ని అనుసరించి, తరించు. నీవు ఇష్టంగా జపం చేస్తున్నావు అనుకో అవసరంలేని తలంపులు ఆగిపోతాయి. జపం చేస్తూ ఉంటే దుర్మార్గంలో ఉన్న మనిషికి సన్మార్గం చూపిస్తుంది. అయితే మీరు ఏమార్గంలో ప్రయాణంచేసినా దానిమీద మీకు ఇష్టం ఉండాలి, ప్రేమ ఉండాలి, నమ్మకం ఉండాలి. నువ్వు ఏది చేసినా జపంచేసినా, ధ్యానంచేసినా, ఒక మంచిమాట మాట్లాడినా, మంచిపని చేసినా అది వృధా పోనివ్వడు ఈశ్వరుడు అంటున్నారు భగవాన్. అందరూ బాగుపడాలి, క్షేమంగా ఉండాలి అనే తలంపులు నీకు వస్తున్నాయి అనుకో దానికి నీకు ఫలితం ఇస్తాడు, ఒకవేళ నీవు చెడ్డ చేసావు అనుకో దానికి నీకు ఫలితం ఇస్తాడు ఆ కర్మఫలం ఏదో జన్మలో నీచేత అనుభవింపచేస్తాడు, వాడు ఈశ్వరుడు. నువ్వు ఏది చేస్తే అదే నీకు ఎదురువస్తుంది కాని చెయ్యనిది నీకు ఎదురుకాదు. నీ దేహానికి ఏదో ప్రారబ్దం ఉంది. దానిని విసుగ్గా అనుభవించకు, సంతోషంగా అనుభవించు. మా

కోడలు మంచిది కాదు అని చెప్పినా, మా అత్తగారు మంచిదికాదు అని చెప్పినా లాభంలేదు. మీరు చేసుకొన్నదానిని బట్టి అవి ఎదురవుతాయి. అందుచేత వాటిని సంతోషంగా అనుభవించటం మంచిది. నీవు అహంభావనతో కనుక పనిచేస్తే ఎత్తుకు ఎత్తు అనుభవించాలి, అహంభావరహితముగా పనిచేస్తే ఏదీ నిన్ను అంటదు. పుణ్యం అంటదు, పాపము అంటదు. జపం చేయగా చేయగా మిగతాతలంపులు అన్నీ ఆగిపోతాయి, అప్పడు ఆ తలంపు గట్టిపడుతుంది. అప్పడు ఆ తలంపు ఏమిచేస్తుంది అంటే మిమ్మల్ని హృదయంలోనికి తీసుకొనివెళ్ళి అదికూడా అణిగిపోతుంది. అది జపసాధన. భగవాన్ ఏమంటున్నారు అంటే జపం చేసుకోండి, మంచిదే. మధ్య మధ్యలో ఆజపం చేసే జపి ఎవరు అని ప్రశ్నించండి. జపం ఎవరు చేస్తున్నారు? శరీరం జపంచెయ్యదు, లోపలఉన్న బ్రహ్మంకు వీటితో సంబంధం లేదు. మరి ఎవరు చేస్తున్నారు అంటే మనస్సు చేస్తోంది. సాధన అంటే ఏమీలేదు మీ మనస్సు శరీరంవైపు జరుగుతోందా, బ్రహ్మంవైపుకు జరుగుతోందా అది చూసుకోవాలి. మీరు ఏ మార్గంలో ప్రయాణంచేస్తూ ఉన్నా ఒక్కటే చూసుకోండి, మీ మనస్సు మీకు తెలుస్తోంది కదా. మీ మనస్సు చనిపోయే శరీరంవైపు జరుగుతోందా, లేక చావులేని బ్రహ్మపదార్థం వైపుకు జరుగుతోందా మీ మనస్సు ఎటు ప్రయాణం చేస్తోంది అనేది చూసుకోండి. నీ మనస్సు చావులేని వస్తువు వైపుకు, హృదయం వైపుకు ప్రయాణం చేయాలి, అదే మీ సాధన యొక్క గమ్యం. మీలో అజ్ఞానం నశించినప్పడు, అహంభావన నశించినప్పడు, శవబుద్ధి నశించినప్పడు ఒక్క క్షణంకూడా వెయిట్ చేయడు, భగవంతుడు వెంటనే వస్తాడు, మిమ్మల్ని రక్షిస్తాడు, మీకు మోక్షం ఇస్తాడు. అందరిచేత గౌరవింపబడాలి అనుకోవటం అది భక్తుడి లక్షణంకాదు. అందరిచేత గౌరవింపబడాలి అని నీవు అనుకొంటే నీకు లోకవాసన పెరుగుతుంది. లోకవాసన ఉన్నా, శాస్త్రవాసన ఉన్నా నీ మనస్సు బాహ్యముఖానికి వచ్చేస్తుంది. ఈ రెండింటి కంటే దేహవాసన బలీయమైనది. దేహవాసన మనిషిని పీడించేస్తుంది. ఎంతో సాధన ఉంటేనేగాని ఈ దేహవాసన విడిచిపెట్టదు. దేహం అంటే ఏమీలేదు అదికూడా ఒక తలంపే. పుట్టిన దేహం నీవుకాదు, పుట్టని బ్రహ్మమే నీవు అదీ రమణసిద్ధాంతం. నువ్వు అసలు పుట్టలేదు కాని పుట్టానని అనుకొంటున్నావు ఎందుచేత పుట్టాననుకొంటున్నావు? దేహము నేను అనే తలంపు వలన అలా అనుకొంటున్నావు. రైలు యాక్సిడెంట్ అయి వందలమంది చనిపోతూ ఉంటారు చూడండి. అంటే ఆరోజు





చనిపోయేవారిని ఆ పెట్టెలో ప్రయాణంచేసేటట్లు భగవంతుడు చేస్తాడు. ఎక్కడెక్కడి వారో కలిసి ప్రయాణం చేస్తూ ఉంటారు, చనిపోతారు. దానిని సమిష్టి ప్రారబ్ధం అంటారు. ఇది అంతా భగవంతుడి మాయ. దానిని అర్థం చేసుకోవటానికి మన తెలివితేటలు సరిపోవు కాని మనం తెలివైన వారం అని మనం అనుకొంటూ ఉంటాము. మన తెలివితేటలు దేనికి పనికిరావు. ఈ లోకము దుఃఖానికి ఆలయం, అసత్యానికి ఆలయం అని భగవంతుడు చెప్పాడు. ఈ లోకము మోసపూరితమైనది అని ఇంకొకటికూడా తగిలించారు ఆచార్యులవారు. భగవాన్ ఏమి చెప్పారు అంటే ఈ లోకం కుక్క తోకవంటిది, దాని వంకర ఎవరు తీయగలరు, అది ఎలా ఉండాలో అలా ఉంటుంది, దాని గొడవ వదిలెయ్యి, నీ పనిఏదో నీవు చేసుకో అన్నారు. మనకు రెండు సుడిగుండాలు ఉన్నాయి అని చెప్పారు. ఆ రెండు సుడిగుండాలలో నుండి జీవుడు బయటకు రాలేడు. అవి మామూలు సుడిగుండాలు అని అనుకోవద్దు, పెద్ద పెద్ద ఏనుగులను కూడా లాగేస్తాయి. ఆ సుడిగుండాలు ఏమిటి అంటే 1. నేను అనే తలంపు, 2. నాది అనే తలంపు. ఈ నేను అనే తలంపు వచ్చాక మనం మాట్లాడతాము, ఈ నేను అనే తలంపు వచ్చాక మనం పనిచేస్తాము. మొత్తం సృష్టి అంతా కూడా ఈ నేను అనే తలంపు వచ్చాక వస్తోంది. ఈ నేను అనే తలంపు లేకపోతే ఏదీలేదు. అది ఎవరని ఆ తలంపును పట్టుకోండి, దానిని పట్టుకొని విచారణ చేయండి. మీరు ఎక్కడకి వెళ్ళవద్దు, చేతులు కదపవద్దు, కాళ్ళు కదపవద్దు, ఇక్కడే కూర్చోండి. ఈ నేను అనే తలంపు వచ్చాక అంతా వస్తోంది, ఈ నేను అనే తలంపు ఎవరు అని జాగ్రత్తగా ఆలోచించండి. మీకు అనేక కారణాల వలన దుఃఖం రావచ్చు, దాని వెనకాల నాది అనే తలంపు ఉంటుంది. నాది అనే తలంపు లేకపోతే అసలు దుఃఖం లేదు. మీపని ఏదో మీరు చేసుకోండి. వ్యాపకాలు పెంచుకోవద్దు. మీ దేహప్రారబ్ధాన్ని బట్టి మీకు ఏపని ఇస్తే దానిని శ్రద్ధగా చేయండి, పనిని పెంచుకోవటానికి ప్రయత్నం చేయవద్దు, చేతిలో ఉన్న పని నుండి తప్పించుకోవటానికి ప్రయత్నం చేయవద్దు. మనం అనవసరమైన విషయాలలో జోక్యం చేసుకొంటే లోకవాసన పెరుగుతుంది. మన లక్ష్యం బ్రహ్మజ్ఞానం మీదే ఉండాలి. నువ్వు దేహంగా ఉండటం అసహజస్థితి, నీవు మనస్సుగా ఉండటం అసహజస్థితి, అహంభావనగా ఉండటం అసహజస్థితి, నీవునీవుగా ఉండటమే సహజస్థితి, దానినే సమాధిస్థితి అంటారు. నీ హృదయంలో ఉన్న బ్రహ్మంను పొందాక ఏదో పొందాను, ఎక్కడికో చేరుకొన్నాను అని నీవు అనుకోవు, మన

ఇంటికి మనం వచ్చాము అని అనుకొంటాము. మన ఇల్లు ఎక్కడ ఉంది? మన హృదయంలోనే ఉంది. మనం అక్కడికి చేరుకొనేవరకు దుఃఖం వెంటాడుతుంది, అశాంతి వెంటాడుతుంది. మనం ఎక్కడికైనా పెద్దమేడలోనికి వెళ్ళి, ఏ.సి. గదిలో కూర్చొన్నాము అనుకోండి, అది మనదికాదు అని మనకు తెలుస్తూ ఉంటుంది. ఏదో గంటసేపు కూర్చొంటాము, వెళ్ళిపోతాము. మనం పుణ్యం చేయటంవలన వచ్చే జన్మలు, పాపం చేయటం వలన వచ్చే జన్మలు అటువంటివే. అసలు వస్తువును చేరాక ఇవి అన్నీ అసత్యాలు అని మనకు తెలుస్తుంది. కబీరు ఏమని చెప్పాడు అంటే నీటిలో ఉన్న చేపకు దాహంలేదు అలాగే హృదయంలో ఉన్నవాడికి అశాంతి లేదు, దుఃఖం లేదు అని చెప్పాడు. నీ హృదయంలో ఉన్న నిజం నీకు తానుగా వ్యక్తమయ్యే వరకు నిజంకాని ఈ శరీరం, నిజంకాని ఇంద్రియాలు, నిజంకాని మనస్సు, నిజంకాని భోగాలు, నిజంకాని లోకం నీకు నిజంగా కనిపిస్తాయి. ఈ సమస్య వచ్చిపడింది, ఆ సమస్య వచ్చిపడింది. ఈ సమస్య పరిష్కారం చేసుకొన్నాము అంటే ఇంకో సమస్య వచ్చి పడింది అనుకొంటాము. నీకు బుద్ధి లేదా ముందు ఈ నేను అనే సమస్యను పరిష్కారం చేసుకోవటం మానివేసి ఆ సమస్యలు చుట్టూ తిరుగుతావేమిటి? ఈ నేను అనే సమస్య ఉన్నంతసేపు నీవు కోటి జన్మలు ఎత్తినా నీకు సమస్యలు తప్పవు. ఆ సమస్య వచ్చేసింది, ఈ సమస్య వచ్చేసింది అని ఏడుస్తావేమిటి. అసలు ఈ నేను అనే సమస్యను పోగొట్టుకోవటానికి ఏడవటం లేదు, దానికోసం నీవు ప్రయత్నం చేయటంలేదు. ఇప్పుడు మనం అసహజస్థితిలో ఉన్నాము. మీరు పూజచేసినా, జపంచేసినా, ధ్యానంచేసినా, విచారణచేసినా అసహజస్థితిలోనుండి సహజస్థితిలోనికి రావటానికే ఇవి అన్నీ కూడా. భగవంతుడు దయాస్వరూపుడు. మీకు ఎప్పడైనా కష్టం పంపినా, బాధ పంపినా మీ జీవితాన్ని మలుపు తిప్పటానికి పంపుతాడు కాని బాధను పంపటంకోసం కాదు. అదికూడా ఆయన దయే. అందుకే దయగల హృదయం భగవాన్ నిలయం అని మళయాళ స్వాములవారు చెప్పారు. భగవంతుడు మన హృదయంలోనే ఉన్నాడు. కాని మనకు తెలియబడటంలేదు. మన మనస్సులో కపటం లేకుండా చూసుకొంటే ఈ క్షణంలోనే మనకు వ్యక్తమవుతాడు. మీకు రాత్రి ఒంటిగంటకు మెలకువ వచ్చింది అనుకోండి, మరల నిద్రపట్టటంలేదు అనుకోండి, కంగారుపడవద్దు. నామం చేసుకోండి, వెంటనే నిద్రపడుతుంది. నిద్రపట్టటం లేదు అని అనుకోవద్దు. ఆ టైమును భక్తికి ఉపయోగించుకోవటం మంచిది.

**05-08-2003**



## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 21-7-2003, విశాఖపట్నం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

పార్వతీదేవి హిమవంతుని కుమార్తె. పార్వతీదేవి శక్తి స్వరూపిణి. తండ్రికి కొన్ని మహిమలు చేసి చూపిస్తూ ఉండేది. నువ్వు నాకు నేత్రానందం కలుగజేస్తున్నావు చాలా సంతోషం. అంతా బాగానే ఉంది, నాకు ఆత్మజ్ఞానం ప్రసాదించు అని హిమవంతుడు పార్వతీదేవిని అడుగుతాడు. మీకు ఆత్మజ్ఞానం కావాలంటే మహర్షులతోటి, మహాత్ములతోటి సాంగత్యం చేయండి, వారి ద్వారానే మీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది అని పార్వతీదేవి చెపుతుంది. మహాత్ములు మీకు బోధించటమే కాదు మీకు అనుభవైకవేద్యం చేస్తారు అని పార్వతీదేవి తండ్రికి చెప్పింది. ఆత్మజ్ఞానం ద్వారానే మనకు అమృతత్త్వం కలుగుతుంది అంటే మరణాన్ని జయిస్తాము. ఆత్మజ్ఞాన సముపార్జనకు శాంతచిత్తం అవసరం. స్త్రీకి మంచి భర్త దొరకటం కంటే, పురుషుడికి మంచి భార్య దొరకటం కంటే, నచ్చిన ఉద్యోగం దొరకటం కంటే శాంతచిత్తం కలవాడు ఈ లోకంలో అదృష్టవంతుడు అని రాధాకృష్ణన్ చెప్పారు. శాంతచిత్తము లేనివాడు ఆత్మజ్ఞానసముపార్జన చేయలేడు, హృదయంలో మనస్సును నిలబెట్టలేడు. శత్రువులను, మిత్రులను సమానంగా చూడండి అని భగవంతుడు చెపుతున్నాడు. కొంతమంది మిమ్మల్ని గౌరవిస్తారు, కొంతమంది మిమ్మల్ని అవమానం చేస్తారు. గౌరవాన్ని, అవమానాన్ని సమానంగా తీసుకోండి అని గీతలో భగవంతుడు చెప్పాడు. ఇవన్నీ ఎందుకు చెపుతున్నాడు అంటే వీటిని మీరు ప్రాక్టీసు చేయకపోతే మనస్సు అణగదు, మనస్సు అణగకపోతే ఆత్మజ్ఞానం కలుగదు. మనం పుస్తకాలను శోధిస్తున్నాము కాని చిత్తాన్ని శోధించటంలేదు. మనం చిత్తాన్ని కూడా అధ్యయనం చేయాలి. మరణానంతరం పుస్తకం మనకూడా రాదు కాని చిత్తం మనకూడా వస్తుంది. మనకూడా వచ్చే చిత్తాన్ని బాగుచేసుకోవాలి. అదే ఈ సత్సంగ సమావేశాల యొక్క ప్రయోజనం.

అధికారంలో ఆనందం ఉంది, ధనంలో ఆనందం ఉంది, చదువులో ఆనందం ఉంది అని ఇలా కోట్లాదిజన్మలు ఈశ్వరుడిలోనుండి వేరుపడి తిరుగుతున్నాము. ఆనందం బయట ఎక్కడా లేదు, నీ హృదయంలోనే ఉంది. ఆ హృదయంలోనుండే నీకు నేను అనే తలంపు వస్తోంది. అదే మొదటి తలంపు. ఆ నేను అనే తలంపు వచ్చాక ఇతర తలంపులు వస్తున్నాయి. నీ దృష్టినంతటిని ఆ మొదటితలంపు మీద కేంద్రీకరించి, సూక్ష్మబుద్ధితో దానిని పరిశీలన

చేస్తూ ఉంటే, దానిని విచారణ చేస్తూఉంటే అది ఏ హృదయంలో నుండి ఉదయించి వచ్చిందో అక్కడకు ఉపసంహరింపబడుతుంది. దానిని హృదయంలో స్థిరంగా ఉంచగలిగితే అది నెమ్మదిగా సన్నగిల్లి నశిస్తుంది. అప్పుడు ఆనందమే నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. మనం కాలాన్ని, శక్తిని ఎక్కువగా వృధాచేసుకొంటున్నాము. కుటుంబపరంగా, సమాజపరంగా మనకు అనేక సంఘటనలు ఎదురవుతాయి. ఆ సంఘటనలకు మనం ఎక్కువ రియాక్టు అయిపోతాము. కేవలం బట్ట కట్టుకోవటానికి, అన్నం తినటానికి మనం ఈ లోకంలోనికి రాలేదు. లోకంలోజరిగే సంఘటనలనుండి మనం ట్రైనింగ్ పొందటానికి ఇక్కడకు వచ్చాము అన్నసంగతి మనం మర్చిపోయాము. అందుచేత నీవు రియాక్టు అవ్వటం తగ్గించుకోవాలి, రియాక్టు అవ్వటం వలన మన శక్తి వృధాఅవుతుంది. ఉద్రేకపడేకొలది మన స్వరూపానికి మనం దూరమవుతాము, చైతన్య స్రవంతిలోనుండి దారితప్పిపోతాము. దీనివలన మానసిక అనారోగ్యానికి గురిఅవుతాము. భగవాన్ దగ్గరకు కోతులు, పాములు, ఉడతలు అన్నీ వస్తూ ఉండేవి. ఉడతలకు జీడిపప్పు పెట్టి, ప్రక్కన ఉన్న కృష్ణస్వామితో ఇవాళ జీడిపప్పు ఉందని పెట్టాము, రేపు మరల వస్తే ఏమి చేస్తాము అని అన్నారు భగవాన్. మీ మహిమ వలన రేపు కూడా జీడిపప్పు రావచ్చు కదా అన్నారు కృష్ణస్వామి. భగవాన్ ఊరకఉన్నారు. ఒకతను భగవాన్ దగ్గరకు పదిసార్లు రిక్తహస్తాలతో వచ్చాడు. ఎప్పడూ భగవాన్ దగ్గరకు రిక్తహస్తాలతో వెడుతున్నాను, ఈసారి ఏదో ఒకటి తీసుకొని వెడదామా అనిపించి జీడిపప్పు తీసుకొని వెళదాము అనే తలంపు వచ్చిందట. ఇదంతా ఈశ్వరలీల. అతను జీడిపప్పు తీసుకుని వచ్చాడు. వాటి టైముకి ఉడతలు వచ్చినాయి. అప్పుడు కృష్ణస్వామి భగవాన్‌తో మీ మహిమవలన జీడిపప్పు వస్తుందని నేను నిన్న చెప్పానుకదా అన్నారు. అప్పుడు భగవాన్ అంటారు నా మహిమవలన జీడిపప్పు రాలేదు, వాటికి తినేయోగం ఉంది కాబట్టి జీడిపప్పు వచ్చింది, ఇందులో నా మహిమతో సంబంధం లేదు అన్నారు. ఇది వ్యక్తిలేని వ్యక్తిత్వం. దీనిని మనం అలవర్చుకోవాలి.

ఈ లోకంలో ఇంత దుఃఖం కనిపిస్తున్నదే, ఇంత అశాంతి కనిపిస్తున్నదే, ఎందుకు భగవంతుడు ఇంత దుఃఖం పెట్టాడు అది నా ప్రశ్న అని ఒక ప్లీడర్‌గారు భగవాన్‌ను అడుగుతున్నారు. భగవాన్ ఏమంటున్నారు అంటే అది నీ ప్రశ్న, ఈ లోకంలో ఉన్న దుఃఖం, అశాంతి ఎవరికి కనిపిస్తోంది అన్నది నా ప్రశ్న అంటున్నారు భగవాన్. అది మిధ్యానేనుకు కనిపిస్తోంది. లోకంలో ఉన్న దుఃఖం గాఢనిద్రలో ఏమైనా కనిపిస్తోందా, కనిపించటం లేదు. గాఢనిద్రలో నీకు నేను అనే తలంపు లేదు, అక్కడ లోకంలేదు, దుఃఖం లేదు. నేను అనే తలంపు వచ్చాక దుఃఖం, సంతోషం ఇలా ఏవో తలంపులు వస్తున్నాయి. ఈ తలంపులు ఎవరికి కనిపిస్తున్నాయి అని నా ప్రశ్న. ఇవి అన్నీ దొంగనేనుకు కనిపిస్తున్నాయి. అది ఎంత నిజమో ఈ దుఃఖం, అశాంతి కూడా అంతే నిజం. కొంతమంది భగవాన్ గురించి అంటారు రాముడు బాణం తీసుకొని వచ్చాడు, కృష్ణుడు చక్రం తీసుకొని వచ్చాడు కాని భగవాన్‌కు బాణం లేదు, చక్రం లేదు నేను ఎవడను అనే ప్రశ్నను తీసుకొని వచ్చాడు అంటారు. మీరు ఏ ప్రశ్న వేస్తున్నా ఆ ప్రశ్న అడిగే నేను ఎవరు? అంటారు. మనోమూలంలోనే భగవంతుడు ఉన్నాడు మనస్సును ఉపసంహరించి దాని మూలంలోనికి పంపగలిగితే, మనస్సు సహజంగా అక్కడ ఉండగలిగితే అది నశిస్తుంది, స్వరూపం నీకు గోచరిస్తుంది. అప్పుడు ఎటుచూసినా ఆనందమే, ఎటుచూసినా శాంతే, అప్పుడు చావు అనే దానికి అర్థం లేకుండా పోతుంది. మామూలుగా సహజంగా వర్షం వచ్చింది అనుకోండి. ఏదో అభిషేకాలు చేసాము, పూజలు చేసాము వర్షాలు వచ్చాయి అనిఅంటే మనిషిని ఎక్కడకు తీసుకొని వెళ్తున్నట్లు. జ్ఞానం వైపుకు తీసుకొని వెళ్తున్నామా? అజ్ఞానం వైపుకు తీసుకొని వెళ్తున్నామా? నీ హృదయంలో ఉన్న వస్తువును అనుభవంలోనికి తెచ్చుకో, అప్పుడు లోకం లోకంగా కనబడదు, లోకం కూడా ఆత్మగానే కనబడుతుంది. మనం పుట్టిన చోటు విశాఖపట్నం కాదు, హైదరాబాద్ కాదు, మన పుట్టిల్లు హృదయమే. నేను అనే తలంపు హృదయంలోనుండే వస్తుంది. కోరిక, కోపం, అసూయ ఇవిఅన్నీ కూడా ఎమోషన్స్. వీటివలన మన పుట్టింటికి మనం దూరమైపోతున్నాము. మీరు వచ్చిన దారినే వెళ్ళిపోండి, మీకు జ్ఞానం కలుగుతుంది అంటారు భగవాన్. అంటే నేను అనే తలంపు ఎక్కడ నుండి వచ్చిందో అక్కడకు వెళ్ళిపోండి. నేను అనే తలంపు హృదయంలో నుండి వచ్చింది, అక్కడకు వెళ్ళపోండి అని చెప్పటం.

మన విశ్వాసాన్ని బట్టి, నమ్మకాన్ని బట్టి మన ప్రవర్తన ఆధారపడి ఉంటుంది. మనం నోటితో భగవంతుడు ఉన్నాడు అంటున్నాము, మనస్సుతో లేడు అంటున్నాము. ఈశ్వరుడు ఉన్నాడు అని పరిపూర్ణమైన విశ్వాసం మనకు ఉంటే మన ప్రవర్తన మారిపోతుంది. వ్యక్తులపట్ల, ప్రపంచంలో జరిగే సంఘటనల పట్ల మనచూపే మారిపోతుంది, ఆలోచనావిధానం మారిపోతుంది, మారుమనస్సు పొందుతాము. అప్పుడు మనం

హృదయంలోనికి వెళ్ళటం కాదు, హృదయంలో ఉన్న ఈశ్వరుడే మనలను లోపలకు గుంజుకొని ఆయన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. మిమ్మల్ని ఎవరైనా విమర్శిస్తే మీరు కంగారు పడిపోతారు. కాని దాని వలన మీరు నష్టపోయేది ఏమీలేదు. మీరు నష్టపోతున్నాము అనుకొంటున్నారు కాని కొద్దిగా లోచూపుతో ఆలోచిస్తే మీరు నష్టపోయేది ఏమీలేదు. మీరు నష్టపోయేది ఏమీ లేదు అని మీకు అర్థమవుతూ ఉంటే దానివలన రియాక్షన్ ఏమీ రాదు, నష్టపోతున్నాము అని అనుకోవటం వలన రియాక్షన్ వస్తోంది. మీరు ఏదైనా మంచిపని చేసారు అనుకోండి. ఎవరైనా వచ్చి మీరు చాలా మంచిపని చేసారు అన్నారు అనుకోండి. దానివలన మీరు లోపల కొంచం ప్లెజర్ తీసుకొన్నారు అనుకోండి, మీరు అవుట్. ప్లెజర్ ఎవరు తీసుకొన్నారు? మీ దేహం కాదు, నేను అనే తలంపు తీసుకొంది అంటే దానివలన అది బలపడిపోతుంది, మీరు అవుటైపోయినట్లే. రామకృష్ణ పరమహంస గారు చమత్కారంగా చెపుతూ ఉంటారు. ఎవరైనా చెరువుకు రేవు కట్టించారు అనుకోండి, వారు ఆయన దగ్గరకు వచ్చి కూర్చొన్నప్పడు ఎవరో రేవు కట్టించారు, చాలా బాగుంది అనేవారు. కట్టించిన వారు అక్కడే ఉన్నారు కదా వాడు వెంటనే లేచి నేనే అని చెప్పేవాడు. అసలు పోగొట్టవలసింది దానినే అనేవారు.

పని చేయండి, ఫలితంపట్ల ఆసక్తి పెట్టుకోవద్దు. అప్పడు మీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తుంది. అంతేకాదు మీ మనస్సు చిరిగిపోతుంది. జీవలక్షణాలు ఎక్కువగా ఉన్నవాడికి ఆత్మజ్ఞానం గురించి చెపితే అందుకోవటం కష్టం. భగవాన్ సన్యాసిని ఎలా చూసేవారో, గృహస్థుడను కూడా అలాగే చూసేవారు. సన్యాసి నేను సన్యాసిని అనుకొంటున్నాడు, గృహస్థు నేను గృహస్థుడను అనుకొంటున్నాడు. ఆ బట్టలతోటి, దేహంతోటి తాదాప్యం పొందుతున్నారు. ఇద్దరికి కూడా ఆత్మభావన లేదు. నేను సన్యాసిని అనుకొనేదీ తలంపే, నేను గృహస్థుడను అనుకొనేదీ తలంపే. నేను పెళ్ళి చేసుకొన్నాను అనేది ఒక తలంపు, నాకు పెళ్ళికాలేదు అనేది ఒక తలంపు. ఇవి అన్నీ తలంపులే. కాని అసలు సత్యం వీటిఅన్నింటికి అతీతంగా ఉంది. భగవాన్ ప్రపంచంలోని ఏ సంఘటనలోనుండి ప్లెజర్ తీసుకోలేదు. బాహ్యంగా నీవు ఏ సంఘటనలో నుండి ప్లెజర్ తీసుకొన్నా తప్పనిసరిగా అది పెయిన్ క్రింద మారిపోతుంది అని చెప్పారు. ప్రశ్నలు తగ్గించుకొని భగవంతునికి శరణాగతి చెందు. భగవంతుని సంకల్పానికి అణిగిఉండు. జీవుడు స్వతంత్రుడు





కాదు. ఈశ్వరుడు మాత్రమే స్వతంత్రుడు. మహిమల జోలికి ఎవరూ వెళ్ళవద్దు, వెళితే మనస్సు బాహ్యముఖానికి వెళ్ళిపోతుంది, మీకు అమృతానుభవం కలిగే అవకాశం లేదు. ఆత్మవిద్య మీద మనకు విశ్వాసం తగ్గినప్పడు ఇతర మార్గాలకు వెళతాము. ఏదో మహిమలకు, ఆకర్షణలకు గురి అవుతాము. సబ్జక్టు, ఆలోచన విడిచిపెడితే గాడి తప్పిపోతాము. భగవంతుడి మీద మనకు విశ్వాసం కలుగుతోంది అనుకోండి మనం చేసే సాధన వలన విశ్వాసం కలుగుతోంది అనుకొంటాము. ఈశ్వరుడి పట్ల మనకు కలిగిన విశ్వాసం, ప్రేమ కూడా ఆయన దయ వలననే కలుగుతుంది. ఆయన దయ మనమీద లేకుండా ఆయన మీద మనకు విశ్వాసం కలుగనే కలుగదు. మన తెలివి ఎంత, మనం ఎంత? ఈశ్వరుని మీద మనకు విశ్వాసం కలుగుతూ ఉంటే అది ఆయన దయ అని గుర్తించిన వారు ధన్యులు. మన తెలివి వలననే కలిగింది అనుకొంటే అవమానాలు తప్పవు, పరాభవాలు తప్పవు. ఏ విషయానికి మనస్సులో ఆందోళన పెట్టుకోవద్దు. మీకు కోరికలు ఉంటే వాటిని నీవు మోయవద్దు, ఈశ్వరుడి మీద పడవేయండి. ఎప్పడు వాటిని నెరవేర్చాలో ఆయనే చూసుకొంటాడు. మీకు ఇష్టంలేని సంఘటన ఏదైనా జరిగింది అనుకోండి, ఇలా జరిగింది ఏమిటి అని కంగారుపడతారు. భవిష్యత్‌లో ఆ సంఘటన మీకు మంచిని తీసుకొని వస్తుంది. ఇది తెలియక మీరు కంగారుపడిపోతున్నారు. ఏది జరిగినా అది ఈశ్వరుడికి తెలియకుండా జరగటానికి అవకాశం లేదు. జీవితంలో ప్రతి చిన్నసంఘటన కూడా ఈశ్వరుడి ప్రణాళిక ప్రకారమే జరుగుతోంది. ఇప్పడు మనం ఇక్కడ కూర్చొని మాట్లాడుకొంటున్నాము. ఇది మన నిర్ణయం కాదు, మన తెలివి కాదు, ఇది ఈశ్వరుడి ప్రణాళిక. ఆడించేవాడు ఆయన, ఆడేవారము మనము. అది తెలియకపోవటం వలన మనస్సులో ఆందోళన వస్తుంది. శరణాగతి వలన మాత్రమే అది మనకు అర్థమవుతుంది.

నీవు ఆత్మవై ఉన్నావు. ఇంక ఆత్మను తెలుసుకోవటం ఏమిటి. ఆత్మ కానిదానిని వదులుకోవటమే. నీకు సూక్ష్మబుద్ధి ఉంది అనుకో విచారణ చేసుకో. సూక్ష్మబుద్ధి లేదు అనుకో ముక్కులో గాలి చూసుకో అంటే స్థూలబుద్ధి ఉన్నవారికి ప్రాణాయామం మంచిదే. మనం శిరస్సులో ఒకలాగ ఉంటున్నాము, హృదయంలో ఒకలాగ ఉంటున్నాము. ఇవి రెండూ ఏకమైనప్పడే మోక్షం, అప్పడు మనకు అమృతానుభవం కలుగుతుంది. ఇందులో రాజీపడే అవకాశం లేదు. ఒకసారి మద్రాసులో గాంధీగారికి ఒక శెట్టియార్ లక్షరూపాయలు విరాళం

ఇచ్చి, నేను పెద్దమొత్తంలో ఇచ్చాను మీకు సంతోషమేనా అని గాంధీగారిని అడిగాడు. అప్పడు గాంధీగారు ఏమి చెప్పారు అంటే నేను సంతోషపడటం లేదు. ఈ తెలివి నాది, ఈ డబ్బు నాది అని నీలో ఏ నేను అయితే అనుకొంటోందో ఆ నేనును త్యాగంచేస్తే నాకు సంతోషం అని చెప్పారు. నీలో ఏ నేను అయితే ఇవి అన్నీ అనుకొంటోందో దానిని త్యాగం చేస్తే గాని నీకు జ్ఞానం కలుగదు. నీకు దేహబుద్ధి ఉన్నంతసేపు ఇవి అన్నీ అనుకోకుండా ఉండలేవు, నీకు ఆత్మబుద్ధి కలిగితే అనుకోవటానికి ఏమీ లేదు. ఐశ్వర్యం అంతా ఈశ్వరుడిదే. నీది అంటూ ఏమీ లేదు. అంతా ఆయనదే. ఆయనదే నీది అనుకొంటున్నావు, ఆయనది ఆయనకే ఇచ్చి నేను ఇచ్చాను అనుకొంటున్నావు, వాడిని ఊడగొట్టుకో, ఆ పొరపాటును గ్రహించి ఇప్పడైనా సరిదిద్దుకో. ఉన్నది చైతన్యం ఒక్కటే. అది తప్పించి ఏమీ లేదు. ఏదైనా ఉంది అనుకొన్నా అది నీ ఊహామాత్రమే. శాస్త్రాన్ని అధ్యయనం చెయ్యి. నీ పొరపాట్లు ఏమిటో చూసుకో. నాలో ఈ పొరపాట్లు ఉన్నాయి, ఈ లోపాలు ఉన్నాయి అని చాదస్తంగా అనుకోవద్దు, వాటిని తొలగించుకోవటానికి ప్రయత్నం చేసుకో. అనాత్మ మీద ఆత్మభావన పెట్టుకోవద్దు. శరీరం అనాత్మే, శరీరం మీద ఆత్మభావన పెట్టుకోవద్దు. నీకో శరీరం ఉంది కాని శరీరం నీవు కాదు. నీవు స్వార్థంతో పనిచేస్తూ, స్వార్థం లేకుండా పనిచేస్తున్నాను అనుకొంటున్నావు. ఇది లోపలనుండి గురువు చూస్తూఉంటాడు. అది నీకు తెలియజేయటానికి ఒక మొట్టికాయ వేస్తాడు. నీకు సరియైన అవగాహన కలుగజేయటం కోసం అలా చేస్తాడు. మనకు దైవభక్తి లేదు, దేశభక్తి లేదు కాని ఉన్నాయి అనుకొంటున్నాము. ఇల్లు మనది అనుకొంటాము, రోడ్డు మనది కాదు అనుకొంటాము. ఇంట్లో ఉన్న పెంట అంతా రోడ్డుమీద వేస్తాము. రాజకీయాలకు పబ్లిసిటీ కాని, భక్తుడికి పబ్లిసిటీ అక్కరలేదు. మనం ఎంత నిశ్శబ్దంగా, నిర్మలంగా పని చేసుకొంటూ వెళితే భగవంతుని అనుగ్రహం అంత తొందరగా వస్తుంది. దేహం యొక్క ప్రారబ్దం ననుసరించి ఏదో సంఘటన జరుగక మానదు, మంచో, చెడో జరుగుతూ ఉంటుంది. ఈ సంఘటనలకు ఉద్రేకపడితే మన శక్తి వృధా అయిపోతుంది, ఇంక విచారణ చేయటానికి మనకు శక్తి ఎక్కడ ఉంటుంది, మనం శక్తి హీనులమవుతాము. నీ శరణాగతి నిజమైతే భగవంతుడి సంకల్పానికి బద్ధుడవై ఉండు. మీ సాధన బాగా జరగాలంటే పచ్చళ్ళు తినవద్దు, పచ్చళ్ళు ఉద్రేక పరుస్తాయి. మనందరకు తిండి అంటే ఎక్కువ ఇష్టం అందువలననే జ్ఞానం మీద అపేక్ష తగ్గిపోతోంది. నోటితో భగవంతుడి సంకల్పం నెరవేరాలని అంటాము లోపల నా సంకల్పం నెరవేరాలి అనుకొంటాము ఎందుచేతనంటే దేవుడికంటే మన అహంకారం అంటే మనకు ఎక్కువ ఇష్టం. మీ దేహానికి గాయం తగిలితే తొందరగా తగ్గిపోతుంది. కాని దేహాభిమానానికిగాయం తగిలితే తగ్గటానికి సంవత్సరాలు పడుతుంది. మనఇంట్లో ఎవరైనా చనిపోయారు అనుకోండి. వారి జ్ఞాపకాలు గుర్తుకు వచ్చి దుఃఖపడుతూ ఉంటాము. కాలం గడిచే కొలది ఆ దుఃఖం యొక్క వేగం తగ్గిపోతూ ఉంటుంది అయితే దుఃఖపడేవాడు అక్కడ లేడు అని కాదు. కాలం దుఃఖాన్ని అణిచి ఉంచుతుంది కాని దుఃఖపడేవాడిని పరిష్కారం చేయలేదు. నీకు ఆత్మజ్ఞానం కలిగేవరకూ ఇది పరిష్కారం కాదు. కాలప్రవాహంలో దుఃఖం తగ్గుతుంది అలాగని దుఃఖం లేకపోవటం కాదు. అది అణిగి ఉంటుంది, మరల ఆ జ్ఞాపకాలు వస్తే సడన్‌గా దుఃఖం వచ్చేస్తుంది. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఒకవేళ మీకు దుఃఖం వస్తోంది అనుకోండి, మీ దుఃఖం మిమ్మల్ని ఈశ్వరుడివైపుకు త్రిప్పుతూ ఉంటే ఆ దుఃఖం మంచిదే అంటున్నారు. అంతా మిధ్య, అంతా స్వప్నం అంటున్నారు కదా ఇంక ఈ బోధ ఎందుకు అని ఒకరు ఆచార్యులవారిని అడిగారు. ఏనుగు నిద్రపోతోంది అనుకోండి, స్వప్నంలో సింహం వచ్చింది అనుకోండి, వెంటనే ఏనుగుకు మెలుకువ వచ్చేస్తుంది. స్వప్నంలో వచ్చిన సింహం అసత్యం కాని ఏనుగుకు మెలకువ రావటం నిజం. అలాగే నాబోధ ఏనుగుకు వచ్చిన స్వప్నసింహం వంటిది అయినా మీకు మెలుకువ తీసుకొని వస్తుంది అని చెప్పారు. ఎవడి పని వాడు శ్రద్ధగా చేసుకోవటమే నిజమైన నమస్కారము, మనస్సు అణిగి ఉండటమే నిజమైన నమస్కారం. ముందు సబ్జక్టును ప్రేమించండి. ప్రేమ లేకుండా జ్ఞానం రాదు. ప్రేమించటం వలన మనస్సు అక్కడ నిలబడుతుంది. ప్రేమ లేకపోతే మనస్సు నిలబడదు, ఏదో వంపులు వెతుకుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 10-08-03 | ఆదివారం | జిన్నూరు శ్రీ రమణక్షేత్రం |
| 17-08-03 | ఆదివారం | విజయవాడ, ముత్యాలంపాడు, రామలింగేశ్వర ఆలయంలో, గవర్నమెంట్ ప్రెస్ దగ్గర |
| 19-08-03 | మంగళవారం | జగ్గయ్యపేట, సీతారామపురం కొత్త వెంకటేశ్వరస్వామి కళ్యాణ మండపం |

## భక్తి గల జన్మే - హృదయ గ్రంధులను తెంచేస్తుంది

కారణభక్తిలో విసిగిపోయాకే ఈశ్వరునిపై అకారణమైనభక్తి అంకురిస్తుంది. ముక్తి కావాలని ముచ్చటపడేవారు, తపించేవారు ఆయనను తల్లిగా, తండ్రిగా, గురువుగా అంతా నీవే అని భావిస్తూనాకు ఏది మంచిదో నాకన్న బాగా నీకే తెలుసు. నీ ఇచ్ఛయే జరగనీ అంటారు. మనస్సు నిర్మలమై, శోక పాశాలనుంచి విడుదలై సత్యంలో ఐక్యం కావాలంటే తరుణోపాయం ఒక్కటే అది సద్గురు పాదాలయందు నిజమైనభక్తి కలిగిఉండటమే. ఆయనను మానవమాత్రుడిగా తలంచక పరమాత్మయే అని తిరుగులేని నమ్మకంతో భక్తి కలిగిఉండటమే. సద్గురువు మీద విశ్వాసం ఉంచిన వారికి కూడా కష్టాలు రాక తప్పదు. పరీక్షల్లో ఆరితేరితే గాని మనలను విశ్వసించరు అనుగ్రహం యియ్యటానికి. ముందు మనం అస్వతంత్రులమని పరిపూర్ణంగా నమ్మి సంపూర్ణశరణాగతి చెందితే గాని ఆయన రక్షణకు పూనుకోరు. అటువంటి ఆర్తులకు సహాయం కోసమే ఎదురుచూస్తుంటారు. తనను తాను రక్షించుకోగలనని నమ్మినవారికి దైవసహాయం ఎలా అందుతుంది? సద్గురు సహాయం తన అంతరంగిక మండలిలో కర్మలభారం తగ్గినవారికి తాను ఎన్నుకొన్న కొంతమంది భక్తులకీ సంపూర్ణ అనుగ్రహం లభించి ఈ జన్మలోనే తరింపజేస్తారు. మనస్సు మాట వినక నిరంతరం గురుప్రేమను కాంక్షించేవారికి వారు యిలా అభయహస్తం యిస్తారు. నా ప్రేమలో ధైర్యంగా ఉండు. నిన్ను నేను ఎప్పుడు మర్చిపోను. అందుకే శ్రీ నాన్నగారు యిలా అంటారు పిడుగులు వచ్చి మీద పడుతున్నా భయపడకండి. మీ గురువు మీ వెంటే ఉన్నాడని ఆత్మానుభవం కలిగేవరకు మిమ్మలను కంటికిరెప్పలా కాపాడతాడని నమ్మండి అన్నారు. మరి వారిమాటలను విశ్వసించక పోతే తప్పు ఎవరిది. భక్తిరహితంగా కేవలం పురుషప్రయత్నంతో కర్మానుష్టానముచేగాని, సదాచారముతో, జపధ్యానాలు చేసినా ఈశ్వరానుగ్రహం లేనిదే ఏ ప్రయోజనం అంతగా ఉండదు. అద్వైతాన్ని స్థాపించిన శంకరులు చివరకు భక్తి సంభందమైన శివానందలహరిని రచించారు, బ్రహ్మసూత్రాలను కూర్చిన వ్యాసముని భాగవతాన్ని వ్రాసిన తరువాతే సంతృప్తి పడ్డారు. గురువు పై ప్రేమ గమ్యాన్ని త్వరగా చేరుకోవటానికి మనకు సహాయపడుతుంది. సాధకుడు గురువును యిలా ప్రార్ధించాలి "నీ శక్తి వల్లనే నిన్ను స్మరిస్తున్నాను. నేను ఎంతో కొంత ప్రయత్నం చేస్తాను, భారమంతా నీదే" అని అనగలిగినప్పుడు ఆయనను ప్రేమించే శక్తిని కూడా ఆయనే మనకు యిస్తారు. అప్పుడు మన హృదయగ్రంధులు తెగిపోతాయి. స్వేచ్ఛామండలంలో మనం ప్రవేశిస్తాము.

**సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం**



## శ్రీ పావన వశిష్ఠ బ్రహ్మకుండ గోదావరీ క్షేత్రం ముక్కామలలో సద్గురు శ్రీ నాన్నగారు

ప॥గో॥జిల్లా ముక్కామల శ్రీ శ్రీధర్ స్వామీజీ ఆశ్రమములో శ్రీ పావన వశిష్ఠ బ్రహ్మకుండ గోదావరీ పుష్కరముల సందర్భముగా శ్రీ యజ్ఞపురాధీశ్వరీ పీఠాధిపతులు పరమపూజ్య శ్రీ శ్రీధర్ స్వామీజీ వారి ఆధ్వర్యములో జరుగుచున్న శ్రీ అంబామహాయాగానికి, సద్గురు శ్రీనాన్నగారు మొట్టమొదటి రోజు వేంచేశారు. సద్గురు శ్రీనాన్నగారిని ఉదయం గం॥ 11-00లకు శ్రీధర్ స్వామీజీ, ముక్కామల గ్రామస్తులు ఘనంగా పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం శ్రీ నాన్నగారు ఆశ్రమంలో కొలువైయున్న శ్రీ బాలనాగ త్రిపురసుందరీ అమ్మవార్ని, శ్రీ గాయత్రీ అమ్మవార్ని, శ్రీ వాణీ బ్రహ్మదేవులను, శ్రీ పంచముఖ ఆంజనేయస్వామి వార్ని, శ్రీ వల్లీ దేవసేనా సమేత తపోషణ్ముఖేశ్వర స్వామి వార్ని, శ్రీ కామధేనువును, శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవార్ని దర్శించిరి. అనంతరం శ్రీ బ్రహ్మకుండ, శ్రీ వాసవీ ఆత్మాహుతి స్నానఘాట్‌లో శ్రీధర్ స్వామీజీ ఆధ్వర్యంలో శ్రీ గోదావరీమాత విగ్రహాన్ని ఆవిష్కరించి, మ॥గం॥ 1-02 ని॥లకు మంగళవాయిద్యాల మధ్య, వేదఘోష మధ్య అఖండ పుష్కర భక్త జనసందోహముల మధ్య పావన గోదావరీమాతను పూజించి గోదావరీ స్నానాన్ని ఆచరించిరి. అనంతరం, శ్రీ అన్నపూర్ణ నిలయంలో పుష్కర అన్నదానాన్ని ప్రారంభించి, భక్తులనుద్దేశించి అనుగ్రహభాషణ చేసిరి. అనంతరం శ్రీ నాన్నగార్కి గ్రామస్థులు పాదపూజ చేసి పరవశించిపోయిరి. సుదూర ప్రాంత భక్తులు విశేషంగా ఈ మహోత్సవములో పాల్గొని తరించిరి.



**ముక్కామల శ్రీధర్ గారి నిలయంలో సద్గురు శ్రీ నాన్నగారు, శ్రీధర్ స్వామీజీ**



**ముక్కామల సమీపంలో నిర్మించిన గోదావరి మాత విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సద్గురు శ్రీ నాన్నగారు**